

# త,ధి,తోం,న

గిరీశం తన ఇరవైయ్యో ఏట పాత సత్రంలో ఓ హరికథకి వెళ్ళాడు. అతని మనస్సు కథమీదికి పోలేదు. ఫిడేల్ మీదికీ పోలేదు. మద్దెల వాయిస్తున్న బుల్లెయ్య మీదికి పోయింది. ఆ వరసలు, ఆ ముక్తాయింపులు మహ సొంపుగా ఉన్నాయి. తనక్కూడా మద్దెల నేర్చుకోవాలనిపించింది. ఇంకా కథ జరుగుతూండగానే బుల్లెయ్య పక్కకి చేరాడు. "అయ్యా! మీకు పాలు కావాలా? లేకపోతే పానకం తెప్పించనా?" అని మాటలు కలిపాడు. కథ అయిపోయింతర్వాత బసదాకా మద్దెల తనే మోసి, మంచం వేయించి బుల్లెయ్య పడుకున్న తర్వాత తాపీగా చెప్పాడు. 'తమ శిష్యుడిగా చేరి మద్దెల నేర్చుకోవాలనుందండీ' అని. బుల్లెయ్యదేమో ఆరుమైళ్ళ అవతల వూరు. అయినా సరే వారానికి రెండు

రోజులు పాఠం చెపితే చాలన్నాడు.

"ఏమిచ్చుకుంటావ్," అన్నాడు బుల్లెయ్య.

"గురువులే చెప్పాలి" అన్నాడు గిరీశం.

"భక్తిగా వున్నావు కాబట్టి చెప్తున్నా. నెలకి పది రూపాయలిచ్చుకో."

"బాబ్బాబు ఐదిచ్చుకుంటాను" అని గిరీశం అనగా బుల్లెయ్య కొంచెం ఆలోచించి, 'భక్తి ముందు డబ్బెంత! మంచి రోజు చూసి వచ్చేసెయ్' అన్నాడు.

ఆ మర్నాడే వడ్రంగి దగ్గర కెళ్ళి అటో చెక్కా, ఇటో చెక్కా మధ్య నోకర్రా వేసి తొందెర చేయించి ముహూర్తం చూసుకుని బుల్లెయ్య వూరికెళ్ళాడు. బుల్లెయ్య తొందెరకి బొట్లు పెట్టించి కొబ్బరికాయ కొట్టించి దక్షిణ పుచ్చుకుని 'త,థి,తో,న' అని మొదటి పాఠం ప్రారంభించాడు. చెక్కలమీద చేతులు నెప్పులు పుట్టేదాకా పాలవరసల్లో మొదటి వరస వాయించాడు. ఇంటికెళ్ళి మూడుకాలాల్లో సాధన చెయ్యమని పంపించేడు బుల్లెయ్య.

ఇంటికొచ్చిన గిరీశానికి వేరే ధ్యాస లేదు. రాత్రింబగళ్ళు కృషి చేస్తున్నాడు. కాని రెండు కాలాలకి మించి మూడో కాలానికి వేళ్ళు నడవ్వే? గురువుగారు తిట్టాడు. విసుక్కున్నాడు. మూణ్ణెల్లయింది మూడో కాలం అందలేదు. ఈ లోపున గురువుగారు వూరువిడిచి పోవటంతో విద్య మధ్యలో ఆగిపోయింది.

కొంత కాలానికి ఇంకో ఎల్లయ్యని పట్టుకున్నాడు గిరీశం. ఇంత సాధన చేసినవాడికి తొందెర ఏవిటయ్యా? మృదంగం కొను, మూడు రోజుల్లో నీ చేత కచేరీ వాయింపిస్తా నన్నాడు ఎల్లయ్య. అప్పుచేసి మృదంగం కొన్నాడు. ఆర్నెల్లయినా పాల వరసలు దాటలేదు.

ఈ లోపున ఓ రోజు గంగిరెద్దునాడిస్తూ ఒకతను వచ్చాడు. అతని డోలు వరసలు బాగావున్నట్టు అనిపించింది గిరీశానికి. అతనికి సోలెడు బియ్యం పోసి ఆ వరసలు తనకు నేర్పమన్నాడు. అతగాడు మీకు మృదంగం పనికి రాదండి. డోలు నేర్పుతానన్నాడు. 'సరే విద్య రెంటికి ఒకటే కదా! అలాగే కానీ, అన్నాడు గిరీశం.

అక్కడ్నించి అతగాడి డోలు వాద్యం ప్రారంభమైంది. అతనికి భోజనం రెండు పూటలా గిరీశం ఇంట్లోనే. అహోరాత్రాలు డోలు సాధన సాగుతోంది. నెల రోజులయింది. గిరీశం భార్య భరించలేకపోయింది. 'భోజనం ఖర్చయితే పర్వాలేదు. ఈ డోలు గోలేవిటి?'అనుకొని మొగుణ్ణి పక్కకి పిలిచి "మీకు పెళ్ళాం కావాలో, డోలు కావాలో తేల్చుకోండి. నేను పుట్టింటికి పోతా" అంది.

అక్కణ్ణించి డోలు సాధన గుళ్ళో పెట్టాడు. ఆర్నెల్లు చూసి ఇక నేను అన్నం కూడా పెట్టనంది భార్య. దాంతో డోలు ఆగిపోయింది. కాని గిరీశం పట్టు మాత్రం ఆగలేదు. అనేకమంది గురువులను ఆశ్రయించాడు. ధబ్బిచ్చాడు. పాదసేవ చేశాడు. ఖాళీగా క్షణం కూర్చోడు. రెండు మోకాళ్ళమీద సాధన చేస్తూనే వున్నాడు. పదిహేనేళ్ళు గడిచినా పాలవరసలు దాటలేదు.

రెండేళ్ళ క్రితం చిన్నయ్యనే కుర్రాడు మద్దెల మొదలెట్టి ఇప్పుడిప్పుడే భజనల్లో వాయిస్తున్నాడు. వాడి దగ్గరికి రహస్యంగా వెళ్ళి కళ్ళనిళ్ళయిపోయి "ఒరేయ్ నువ్వు నా కొడుకులాంటివాడివి. ఇన్నేళ్ళుగా కృషి చేస్తున్నా విద్య నా కబ్బలేదు. ఆ రహస్యం చెప్పరా" అని ప్రాధేయపడ్డాడు.

"దాందేముంది బాబాయ్! చెప్తా రా" అన్నాడు చిన్నాడు.

రెండేళ్ళపాటు వాణ్ణి వేధించాడు. కాని గొంగళి వేసినచోటే ఉంది. చిన్న చిన్న వాళ్ళు లాభం లేదు. పేరుపొందిన వాళ్ళయితే కిటుకులు చెప్తారని వారానికోసారి పట్నం వెళ్లి ఓ విద్వాంసుడి దగ్గర శిష్యరికం చేశాడు. "ఫలానావారు మా గురువుగారు" అని చెప్పుకోవటమే దక్కింది. కాని, శిష్యుడికేం అంటలేదు.

యాభైయ్యో పడిలో పడ్డాడు గిరీశం. గుళ్ళో కూర్చొని మోకాళ్ళమీద మద్దెల వాయిస్తున్నాడు. ఎదురుగా కూర్చున్న ఓ ముసలాయనకి జాలేసింది. ఇన్నేళ్ళు తపస్సు చేసినా వీడికి విద్య రాలేదే అని "ఒరే గిరీశం! ఇంతమంది గురువుల్ని ఆశ్రయించావు. ఎందువల్లరా నీకు విద్య అబ్బ లేదు?" అన్నాడు. గిరీశం అన్నాడు. "గురువులు మర్మం విడిచి విద్య చెప్పటం లేదు తాతయ్యా లేకపోతే ఈపాటికి మహా విద్వాంసుడ్ని కాకపోయానా!" ✻